క్లుప్తంగా

కళ్లకు గంతలు కట్టుకుని గిటార్ ప్రదర్శన



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న జిష్ణు

ఖమ్మంసహకారనగర్: కళ్లకు గంతలు కట్టుకుని ఏకధాటిగా గిటార్‌పై 22 గంటల పాటు ప్రదర్శన ఇచ్చిన ఖమ్మం విద్యార్థి బొల్లిన జిష్ణు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా రామకృష్ణ – అనురాధ దంపతుల కుమారుడు విష్ణును కలెక్టర్ గౌతమ్ గురువారం అభినందించారు. కాగా, జిష్ణు ప్రస్తుతం సర్వజ్ఞ పాఠశాలలో ఏడో తరగతి చదువుతుండగా, ఈ కార్యక్రమంలో ప్రత్తిగడప నర్సింహరావు, లక్ష్మి, జి.అశోక్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రులకు స్వాగత ర్యాలీ

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం, పువ్వాడ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు, మమత మెడికల్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొనేందుకు గురువారం ఖమ్మం వస్తున్న మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఘన స్వాగతం పలకనున్నట్లు బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకుడు సీహెచ్.రవికిరణ్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల నుండి ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకు బైక్ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఈమేరకు బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు ఉదయం 9.30 గంటలకల్లా కళాశాల వద్దకు చేరుకోవాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో కాళ్ళ ఫౌండేషన్, శరత్ మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యాన బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు పాఠశాల అధ్యక్షుడు గొంగూర వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సంతోష గౌతమ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ ఫౌండేషన్ బాధ్యులు కాళ్ళ భాస్కర్, పాఠశాల కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ కార్డులు ఇవ్వాలి

నేలకొండపల్లి: ప్రైవేట్ టీచర్లకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుతో పాటు రూ.5 లక్షల బీమా కల్పించాలని కోరారు. ప్రైవేట్ టీచర్ల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివిజన్ నాయకులు కోటేశ్వరరావు, జానీ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పర్యటన

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం పర్యటించారు. తొలుత సదాశివాపురం చిన్నారి అన్నప్రాసన్న కార్యక్రమంలో పాల్గొనగా.. తిరుమలాపురంలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. నేలకొండపల్లిలో ఇటీవల మృతి చెందిన మైసా సైదులు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వెనికె జానకిరామయ్య, శాఖమూరి రమేష్, జిల్లా నాయకులు సాధు రమేష్‌రెడ్డి, తుపాకుల ఎలగొండస్వామి, వెన్నపూసల సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని కార్పొరేటర్ షేక్ మక్బూల్ అన్నారు. బుధవారం 23వ డివిజన్‌లో ఆరోగ్యశ్రీ కార్డు నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్య ఖర్చులకు ఆరోగ్యశ్రీలో రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాషా, నలీం అజూ, జయప్రకాష్, జామల్, యాసిన్ ఖాన్, అక్బర్, మొయిన్, ముజూబాయి, సోహెల్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీ కళాశాల సందర్శన

ఖమ్మంసహకారనగర్: స్థానిక ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలను కాళోజీ నారాయణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సంధ్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కళాశాలలోని వివిధ మౌలిక వసతులు, కళాశాల రీసెర్చ్, డెవలమెంట్, ప్లేస్‌మెంట్ సెల్‌లను సందర్శించి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బింధాజ్, అకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాల జావ..!



మామిళ్లగూడెం పాఠశాలలో రాగి జావ కోసం క్యూలైన్‌లో నిల్చున్న విద్యార్థినులు



రాగి జావ.. బాల్యానికి భరోసా

- విద్యార్థుల చదువు, పౌష్టికాహారంపై ప్రభుత్వం దృష్టి
- సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యాన సేవా కార్యక్రమం
- ఉదయం పూట అందిస్తున్న వైనం
- నగరంలో 12 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం

గతంలో అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వమైన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని మాత్రమే ఆలోచించేవి. కాలానుగుణంగా ప్రభుత్వ ఆలోచనా విధానాల్లోనూ మార్పులు వచ్చి చదువుతో పాటు పౌష్టికాహారం అందించాలని భావించాయి. ఈనేపథ్యాన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తొలుత మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. అంతేకాక ఈ ఏడాది జూన్ చివరి నుంచి రాగిజావను సైతం అందిస్తుండడంతో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి కనిపిస్తుందనే చెప్పాలి.

వారానికి మూడు రోజులు..

రాగిజావను వారానికి మూడు రోజులు మంగళ, గురు, శనివారాల్లో అందిస్తున్నారు. ఉదయాన్నే అందిస్తుండటంతో విద్యార్థులు ఇష్టంతో తాగుతున్నారు.

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం నగరం(ఖమ్మం అర్బన్) పరిధిలోని 84 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 12వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కొద్దిమంది విద్యార్థులు పోషకాహార లోపంతో తరచూ అనారోగ్య బారిన పడుతుండడం చూస్తునే ఉన్నాం. ఇలాంటి విద్యార్థుల అనారోగ్య సమస్యలను తొలగించేందుకు రాగిజావను అందించాలని ప్రభుత్వం భావించి గత రెండు నెలల నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తోంది.

శక్తినిచ్చే ఆహారం...

అధిక శాతం మంది పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తుండగా.. వీరిలో కొద్దిమంది ఎలాంటి ఆహారం తీసుకోకుండా పాఠశాలకు వస్తుంటారు. ఈ క్రమంలో వారు ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. అలాంటి సమస్యలను పరిష్కరించేందుకు గాను ఐరన్, విటమిన్ లోపాలు తలెత్తకుండా పలు పోషక గుణాలు ఉన్న రాగిజావను అందిస్తున్నారు. కాగా, రాగిజావ తయారీకి అవసరమైన పోషకాహారాన్ని సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ భాగస్వామంతో ప్రభుత్వం సరఫరా చేస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్యాకింగ్ చేసిన ఫోర్టిఫైడ్ రాగి పొడి, బెల్లం పొడి అందిస్తున్నారు. ఈనేపథ్యాన ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగిపొడి, 10 గ్రాముల బెల్లం పొడిని ఎంఈఓ కార్యాలయాలకు అందిస్తుండగా... ఆ తర్వాత పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ కార్మికులకు రాగిజావ తయారీ బాధ్యతను అప్పగించారు.



రాగి జావ తాగుతున్న విద్యార్థులు

ఇష్టంతో తాగుతున్నాం..



రాగి జావ బాగుంది. మా పాఠశాలలో రోజు విడిచి రోజు జావ అందిస్తున్నారు. ఇష్టంతో తాగుతున్నాం. పౌష్టికంగా మంచిగా అన్పిస్తుంది. ప్రభుత్వం రాగిజావ అందించటం వల్ల మేం శ్రద్ధగా చదువుకునే అవకాశం ఉంటుంది.

– ఎండీ.అఫ్సర్, 8వ తరగతి విద్యార్థి, రిక్కాబజార్ హైస్కూల్, ఖమ్మం

రోగ నిరోధక శక్తి పెరుగుతుంది..



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే రాగిజావ ఈ ఏడాది నుంచే ప్రారంభించారు. వారానికి మూడు రోజులు పంపిణీ చేస్తుండగా.. ప్రతి రోజు విద్యార్థులు ఇష్టంతో తాగుతున్నారు. రాగిజావ పంపిణీతో విద్యార్థుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

– పరుచూరి హరిత, రాజేంద్రనగర్ హెచ్ఎం, ఖమ్మం

డబుల్ ఓటర్లపై నిగ్గు తేల్చాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మువ్వా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నియోజకవర్గ పరిధిలో ఉన్న డబుల్ ఓటర్లపై నిగ్గు తేల్చాలని కోరుతూ ఖమ్మం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగర మున్సిపల్ కార్పొరేషన్ కమీమిషనర్ ఆదర్శ్ సురభికి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు మువ్వా విజయబాబు బుధవారం ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు వేలకు పైగా ఓటర్ల పేర్లు రెండు వేర్వేరు పోలింగ్ బూత్ కేంద్రాల్లో నమోదై ఉన్నట్లు తాము గుర్తించామని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మువ్వా మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గంలో 3,320 మంది ఓటర్ల పేర్లు ఇక్కడే ఉన్న రెండు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో నమోదై ఉన్నాయన్నారు. పాలేరు, మధిర, వైరా, ఇల్లెందు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 2,083 మంది ఓటర్ల పేర్లు అక్కడ ఉన్న పోలింగ్ బూత్‌ల పరిధిలో నమోదై ఉండగా.. అవే పేర్లు ఖమ్మం నియోజకవర్గంలోనూ ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యాన పరిశీలించి వాటిని తొలగించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్ళూరి బ్రహ్మయ్య, కార్పొరేటర్ మలీదు జగన్, సర్పంచ్ మందడపు తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గడప గడపకూ కాంగ్రెస్..

రఘునాథపాలెం: మండలంలోని రాములుతండా, బావోజీతండాల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు మువ్వా విజయబాబు బుధవారం రాత్రి గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని కొనసాగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టబోయే కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుమ్మా దయాకర్‌రెడ్డి, కీసర పద్మజారెడ్డి, రాము, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డిక్లరేషన్ కరపత్రాల ఆవిష్కరణ

కామేపల్లి: మండల పరిధిలోని పాతకమలాపురం గ్రామంలో ఇల్లెందు నియోజకవర్గ నాయకులు భూక్యా దళ్‌సింగ్‌నాయక్ ప్రచురించిన కాంగ్రెస్ పార్టీ పథకాల డిక్లరేషన్ కరపత్రాలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్ నాయక్‌లు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల డిక్లరేషన్ కరపత్రాలు ఇంటింటికీ చేరేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అలాగే ఈ నెల 17వ తేదీన హైదరాబాద్‌లోని తుక్కుగూడలో సాయంత్రం 4గంటలకు జరిగే విజయభేరి భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దళ్‌సింగ్‌నాయక్, మండల అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ, దేవుండ్ల రామకృష్ణ, మోహన్, బాలు, బాబు, లాలు, లక్కు, వెంకటేశ్వర్లు, రవి, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం పునరుద్ధరించాలి



డీఎంకు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు

రఘునాథపాలెం: మండలంలోని జీ.కే.బంజర, టేకులతండ గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వి.రాజు హెచ్చరించారు. బుధవారం కొత్త బస్టాండ్‌లో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యాన డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావుకు విన్నతిపత్రం సమర్పించిన సందర్భంగా వారు మాట్లాడారు. గత పదేళ్లుగా విద్యా సంవత్సరంలో ప్రతీసారి చిమ్మపుడి గ్రామం మీదుగా నడుస్తున్న జీ.కే. బంజర బస్సును కావాలనే డిపో అధికారులు రద్దు చేస్తున్నారని, ప్రతీసారి ఆందోళనలు చేస్తే తప్ప పునరుద్ధరించడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే, పుటన్‌తండా మీదుగా టేకులతండా రూట్‌లో నడిచే బస్సు వారానికి రెండు రోజులు మాత్రమే వస్తుందన్నారు. వెంటనే జీ.కే.బంజర, టేకులతండ బస్సు సర్వీస్‌లను కొనసాగించాలని లేకుంటే డిపోను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు సాధిక్, నవీన్, గణేష్, జనార్దన్, గాయత్రి, రమ్య, శ్రీలక్ష్మి, మధు, వీరబాబు, గోపీనాథ్, నంద కిషోర్, ప్రసాద్, రఘు, గణేష్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకొని వినియోగించుకోవాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కేఎంసీ కార్యాలయంలో డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 19వ తేదీ వరకు ఓటు హక్కుకు దరఖాస్తు గడువు ఉన్నందున ప్రతీ ఒక్క విద్యార్థికి ఓటు హక్కు ఉందా? లేదా? అని పరిశీలించి ఓటు హక్కు నమోదు చేసుకునేలా వారిని ప్రోత్సహించాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 22వ డివిజన్‌లో పేదలకు స్థానిక కార్పొరేటర్ పల్లా రోజ్‌లీనా భర్త పల్లా సాల్మన్ రాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రచార కార్యదర్శి షేక్ షకీనా, డివిజన్ ఉపాధ్యక్షుడు షేక్ సిద్దా సాహెబ్, వెంకటేశ్వర్లు, నాగయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు సన్మానం

ఖమ్మంమయూరిసెంటర్: 16వ డివిజన్ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు దంపతులను స్థానిక యువత, ప్రజలు బుధవారం ఘనంగా సన్మానించారు. గత 25 ఏళ్ల నుంచి గణేశ్ నవరాత్రులకు విగ్రహం, అన్నదానానికి ఆర్థికంగా కార్పొరేటర్ సహకరిస్తున్నారని తెలియజేస్తూ పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యరకనబోయిన వెంకట్రావు, సురేష్, మామిడి నరేష్, సత్యాల వీరయ్య, సతీష్‌రెడ్డి, నర్ల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు 20 నామినేషన్ల దాఖలు..

నేలకొండపల్లి: ఈనెల 22న జరగనున్న చెరువుమాదారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. రెండో రోజు బుధవారం మొత్తం 20 నామినేషన్ల దాఖలు కాగా.. చెరువు సొసైటీ మాజీ అధ్యక్షుడు ఖాసీం తన అనుచరులతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మొత్తం 9 డైరెక్టర్లకు 9 మందితో తన ప్యానల్స్ నామినేషన్లను దాఖలు చేశారు. మహిళ స్థానానికి –3, ఎస్టీ స్థానానికి 1, జనరల్ స్థానానికి 16 నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లను ఎన్నికల అధికారి ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్‌లకు అందించారు. రెండు రోజులుగా 21 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తీగ వెంకటేశ్వర్లు, సీనియర్ సభ్యుడు వెన్నబోయిన శ్రీనివాసరావు, దీరవత్ రాధాకృష్ణ, తుమ్మా ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఇళ్ల స్థలాల కోసం వినతి

ఖమ్మంలీగల్: న్యాయవాదుల ఇళ్ల స్థలాల కోసం 20 ఎకరాల భూమిని స్తంభాద్రి అడ్వకేట్ హౌసింగ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు తక్కువ ధరకు కేటాయించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్‌ను కోరారు. ఈసందర్భంగా ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు ఆధ్వర్యాన బుధవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. న్యాయవాదుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని తక్కువ ధరకు స్థలం కేటాయించేలా చొరవ తీసుకోవాలని విన్నవించారు. న్యాయవాదులు తాళ్లూరి దిలీప్‌చౌదరి, ఎం.జే.ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్‌గుప్తా, ఆవుల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను సాధించాలి

నేలకొండపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధుల అమరవీరుల ఆశయాలను సాధించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. బుధవారం సాయుధ పోరాట వారోత్సవాలను నేలకొండపల్లిలో నిర్వహించిన సందర్భంగా ఆయన ఆనాటి పోరాటాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, దండి సురేష్, మౌలానా, మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్, మారిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బోదులబండ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యాన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, రచ్చా నరసింహరావు, కట్టికోల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నున్నా నివాళి..

ఖమ్మంమామిళ్లగూడెం: మున్సిపల్ చైర్మన్‌గా చిర్రావూరి లక్ష్మీనర్సయ్య ఖమ్మం నగరానికి 45 ఏళ్ల పాటు అవినీతి రహిత పాలన అందించారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు అన్నారు. బుధవారం చిర్రావూరి వర్ధంతి సందర్భంగా ఖమ్మం రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న చిర్రావూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు యర్రా శ్రీకాంత్, సరళ, వైవిక్రం, అఫ్రోజ్ సమీనా, పద్మ, యర్రా శ్రీనివాసరావు, జబ్బార్, నవీన్‌రెడ్డి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన..

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలులో ఇటీవల మృతిచెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు రామనబోయిన శ్రీను సంతాప సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు మాట్లాడుతూ.. శ్రీను తన తుదిశ్వాస వరకు విప్లవ పంథాలోనే పయనించారని తెలిపి శ్రీను స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు శ్రీను, దొండేటి ఆనందరావు, పప్పుల ఉపేందర్, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా సుధాకర్

నేలకొండపల్లి: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన పాగర్తి సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం నియామకపు పత్రాన్ని పార్టీ నాయకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణారావు, దుర్గారావు, హనుమంతురావు, సూరేపల్లి జ్ఞానరత్నం, మోహినుద్దీన్, షర్ఫుద్దీన్, నాగచారి తదితరులు పాల్గొన్నారు.

బాలలు అప్రమత్తంగా వ్యవహరించాలి

రఘునాథపాలెం: బాలబాలికలు తమ చుట్టూ జరుగుతున్న విషయాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ భారతరాణి సూచించారు. మండలంలోని మంచుకొండ పాఠశాలలో స్కోప్ ఆర్‌డీ, మై చాయిస్ ఫౌండేషన్, ఖమ్మం సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యాన బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలల అక్రమ రవాణా, బాల్యవివాహాలు, బాలికలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని చెప్పారు. ఈనేపథ్యాన విద్యార్థినులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏదైనా సమస్యలు ఎదురైతే చైల్డ్‌లైన్ 1098 లేదా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ బాధ్యుడు రామదాసు, పాఠశాల హెచ్ఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ రాజకీయాలను పారద్రోలాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కుల, మత, వారసత్వ రాజకీయాలకు పారద్రోలాలని ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర నాయకులు అన్నారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజకీయాలు పూర్తిగా అవినీతి కుంభకోణంలో ఉండి కూడా చలామణి చేస్తున్నాయని అన్నారు. అన్ని మతాలు, కులాలకు జనాబా ప్రాతిపదికన సీటు కేటాయించే ప్రజాశాంతి పార్టీని ఆదరించాలని కోరారు. ఈ నెల 27న పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏపాల్ ముస్తఫానగర్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో జరిగే సమావేశంలో భవిష్యత్ రాజకీయాలపై మాట్లాడతారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు పీవీరావు, విఠల్‌కుమార్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీ రంగనాథస్వామి గోశాలలో పూజలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ కరిగిరి శ్రీ లక్ష్మీరంగనాథ స్వామి దేవస్థానంలో ఉన్న గోశాలలో బుధవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం–గీతా దంపతులు స్వామి వారికి పూజలు చేయటంతో పాటు గోవులకు కూడా పూజలు చేశారు. ఈ సందర్భంగా నిత్య గోగ్రాసం, దాణ వితరణలో భాగంగా పచ్చిగడ్డి, బెల్లం, దాణాలను అందించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కాన్వాసింగ్ శాఖ ప్రతినిధులు, గో భక్తులు కటకం భాస్కర్ రావు–కవిత దంపతులు, శ్రీ రంగనాథ గో సేవా సమితి సభ్యులు తూములూరి లక్ష్మీనర్సింహారావు, పల్లా లింగయ్య, సూరినేటి మల్లేశం, దేవరశెట్టి రామారావు, సుంకర యల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెకు ప్రజా సంఘాల మద్దతు



మద్దతు ప్రకటిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కామేపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కొత్త లింగాల క్రాస్‌రోడ్డులో గల కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె బుధవారం మూడోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెకు మద్దతుగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్, సీపీఎం జిల్లా నాయకులు దుగ్గి కృష్ణలు మద్దతు ప్రకటించి మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, సీపీఎం నాయకులు టి.ఝాన్సీ, ఎస్పీ రాకేష్, విష్ణు, నరేందర్, పాపారాణి, బాదావత్ శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

కూసుమంచి/నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని కోరుతూ చేపట్టిన దీక్ష బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు సంఘం జిల్లా నాయకులు వడ్లమూడి వెంకటేశ్వర్లు, తోళ్ల సురేష్ మాదిగ పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశాల్లోనే బీజేపీ ప్రభుత్వం చొరవ తీసుకొని బిల్లు అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు పొట్టపింజర బాలస్వామి, మాదాసు వెంకన్న, హనుమంతరావు, గుండెపొంగు శ్రీకాంత్,ఎస్. యాకయ్య, మాగంటి సతీష్, మద్దెల కాళహస్తి, పులిపాటి నరసరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా, దీక్షలకు పలు పార్టీలకు చెందిన నాయకులు సంఘీభావం ప్రకటించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

తిరుమలాయపాలెం: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ బోడ మంగీలాల్ అన్నారు. బుధవారం మండలంలోని కొక్కిరేణి ప్రభుత్వం పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో గ్రామంలోని సీసీ రోడ్డు నిర్మాణం కోసం తొలగించిన ప్రహరీగోడ నిర్మాణానికి, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి చొరవతో రూ.6 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటా నిర్మల, ఎంపీటీసీ గుగ్గిళ్ల అంబేద్కర్, ఉపసర్పంచ్ సిరిగద్దె ఉపేందర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



51వ డివిజన్‌లో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న కార్పొరేటర్ రమావీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతకలకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. బుధవారం నగరంలోని 46వ డివిజన్‌లో కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, 51వ డివిజన్‌లో కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం ఆధ్వర్యాన పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్లలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అంగన్వాడీ సిబ్బంది చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార పదార్థాల గురించి గర్భిణులకు, చిన్నారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు బి.కవిత, మాజీ కౌన్సిలర్ శీలంశెట్టి వీరభద్రం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.